సాక్షి
గుంటూరు

మంగళవారం । 25 । మార్చి । 2025



కారు బోల్తా
పిడుగురాళ్లరూరల్: టైర్ పంక్చరై కారు బోల్తా పడిన సంఘటన పిడుగురాళ్ల మండలం కామేపల్లి బైపాస్‌పై సోమవారం జరిగింది. ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.



ఖురాన్ గ్రంథాలు అందజేత
పట్నంబజారు: పొన్నూరు రోడ్డులోని ఉమే హాజీ బాలిక్ బాణాత్ మదర్సాకు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా సోమవారం పవిత్ర ఖురాన్ గ్రంథాలను బహూకరించారు.



క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ
రాజుపాలెం: క్షయరహిత గ్రామాలే లక్ష్యం కావాలని డాక్టర్ రవితేజ నాయక్ తెలిపారు. రాజుపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం టీబీ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
గుంటూరు	6.25	4.52
బాపట్ల	6.25	4.52
నరసరావుపేట	6.27	4.54

న్యూస్‌రీల్

వైద్యసేవ ఉద్యోగులు విధుల బహిష్కరణ



గుంటూరు మెడికల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం గుంటూరులో ఎన్టీఆర్ వైద్య సేవ క్షేత్రస్థాయి ఉద్యోగులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజ్ కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ప్రభుత్వ శాఖ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ తరపున ఈ నిరసన చేపట్టారు. యూనియన్ నాయకులు ఏపీ జేఏసీ అధ్యక్షురాలు శివకుమారి, కార్యదర్శి ప్రత్యూష, జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు గుంటూరులో న్యాయవాదులు విధుల బహిష్కరణ

గుంటూరు లీగల్: రంగారెడ్డి జిల్లా కోర్టులో ఇ.ఇజ్రాయిల్ అనే న్యాయవాదిని దారుణంగా హత్య చేసినందుకు నిరసనగా గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి సోమవారం పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి దారుణమైన సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.

క్షయ వ్యాధిపై ఫార్మసీ విద్యార్థుల ప్రచారం



తెనాలి: అంతర్జాతీయ క్షయ వ్యాధి దినం సందర్భంగా స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజి ఐపీఏ-ఎస్ఎఫ్, ఎన్ఎస్ఎస్ విభాగాల విద్యార్థులు సోమవారం ప్రచారం నిర్వహించారు. క్షయ వ్యాధిపై అవగాహన ప్రదర్శన చేశారు. క్షయ లక్షణాలు, నివారణ, సమయోచిత చికిత్స వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వ్యాధిపై అవగాహన కల్పించారు. అవసరమైన జాగ్రత్తలను వివరించారు. ఏపీటీఐ-ఏపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్. కె.వెంకటరమణ, ప్రభుత్వ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్య లక్ష్మి, ఐపీఏ-ఎస్ఎఫ్ మెంటర్స్ జి.నందగోపాలకృష్ణ, పి.భార్గవి, ఎన్ఎస్ఎస్-1,2 విభాగాల ప్రోగ్రాం అధికారులు టి.జ్యోతిబసు, కె.కళ్యాణ చక్రవర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుక్మిణీ అలంకారంలో నృసింహుడు



మంగళగిరి: మంగళాద్రిలోని లక్ష్మీ నృసింహ స్వామి సోమవారం రాత్రి రుక్మిణీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆస్థాన అలంకారోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని తరించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో ఏ రామకోటి రెడ్డి ఉత్సవాన్ని పర్యవేక్షించారు. మంగళవారం స్వామి స్తంభోద్భవం అలంకారంలో దర్శనమివ్వనున్నారు.

హత విధి!

విధి నిర్వహణలో పోలీసుల నిర్లక్ష్యం



ఘటనా స్థలం వద్ద చెప్పులు

- 45 రోజుల వ్యవధిలో ఇద్దరి మహిళల హతం
- హడావుడిగా హతుల మృతదేహాల తరలింపు
- ఆధారాల సేకరణలో ఖాకీల విఫలం
- అసహనం వ్యక్తం చేసిన ఎస్పీ సతీష్‌కుమార్
- డీజీపీ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఘటనలు
- రాజధాని ప్రాంతంలో కొట్టొచ్చినట్టు కనిపించిన భద్రతా వైఫల్యం

తాడేపల్లి పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా జరిగిన మహిళ హత్య కేసులో పూర్తి ఆధారాలు సేకరించకుండా మృతదేహాన్ని ఘటనాస్థలం నుంచి తరలించడంపై జిల్లా ఉన్నతాధికారీ అసహనం వ్యక్తం చేయడం దీనికి బలం చేకూరుస్తోంది. గత 45 రోజుల్లో ఈ ప్రాంతంలో ఇద్దరు మహిళలు హత్యకు గురికావడం, డీజీపీ కార్యాలయానికి కూతవేటు దూరంలో నిత్యం వీవీఐపీలు తిరిగే ప్రాంతంలో ఘటనలు జరగడం, రెండు కేసుల్లోనూ పోలీసుల తీరు వివాదాస్పదంగా మారడం కూటమి సర్కారు, హోంశాఖ పనితీరును, భద్రతా వైఫల్యాన్ని ఎత్తిచూపుతున్నాయి.



ఘటనా స్థలం వద్దకు చేరుకుని పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొలనుకొండలో సాయిబాబా గుడి వెనుక కృష్ణాకెనాల్‌కు వచ్చే జంక్షన్‌లో జనవరి 31న కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మహిళ మృతదేహాన్ని ప్రాథమిక దర్యాప్తు చేయకుండా రాత్రికిరాత్రే పోలీసులు మార్చురీకి తరలించారు. 45 రోజుల క్రితం జరిగిన ఈ ఘటనపై పోలీసులు ఇప్పటి వరకు ఎటువంటి ఆధారాలూ సేకరించలేదు. తాజాగా ఆదివారం రాత్రి కొలనుకొండ జాతీయ రహదారి పక్కనే జరిగిన లక్ష్మీ తిరుపతమ్మ హత్య కేసులోనూ పోలీసులు ఇలాగే వ్యవహరించారు. రాత్రి 9.30 గంటలకు వచ్చిన పోలీసులు 11 గంటలకల్లా మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. హత్య జరిగిన వెంటనే ఘటనా స్థలం వద్దకు డాగ్ స్క్వాడ్‌ను తీసుకు రావడంలో పోలీసులు విఫలమయ్యారు. తెల్లవారుజామున ఎప్పుడో నాలుగు గంటలకు డాగ్‌స్క్వాడ్ వచ్చింది. అప్పటికే ఘటనా స్థలం వద్ద ఉన్న సిమెంటుతో కూడిన చెప్పులు, కండోమ్స్, హ్యాండ్‌బ్యాగ్, అమెరికన్ క్లబ్ సిగరెట్ పెట్టెలను తీసివేయడంతో డాగ్ స్క్వాడ్ వచ్చినా ఉపయోగం లేకుండా పోయింది. చివరకు ఎస్పీ సతీష్‌కుమార్ వచ్చేంత వరకు కూడా మృతదేహాన్ని ఉంచకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు పోలీసువర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా డీజీపీ కార్యాలయానికి సమీపంలో వీవీఐపీలు నిత్యం తిరిగే ప్రాంతంలో మహిళ అత్యంత దారుణంగా హత్యకు గురైనా పోలీసులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటనే వాదన సర్వత్రా వ్యక్తమవుతోంది.

గంజాయికి అడ్డా!



హ్యాండ్‌బ్యాగ్‌తో పాటు సిగరెట్ పెట్టె, ఇతర వస్తువులు

కూటమి సర్కారు వచ్చాక తాడేపల్లి ప్రాంతం గంజాయికి అడ్డాగా మారింది. గంజాయి తాగి యువకులు హల్‌చల్ చేస్తున్నారు. మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల నులకపేటలో కార్డన్ సెర్చ్ నిర్వహించిన ఎస్పీ సతీష్‌కుమార్‌కు మహిళలు వివరించారు. రక్షణ కల్పించాలని వేడుకున్నారు.

దర్యాప్తుకు నాలుగు ప్రత్యేక బృందాలు

- అనుమానితులను ప్రశ్నిస్తున్న పోలీసులు
- మృతురాలి మాజీ ప్రియుడిపైనా అనుమానం



లక్ష్మీతిరుపతమ్మ (ఫైల్)

తాడేపల్లి రూరల్: డీజీపీ కార్యాలయ సమీపంలో ఆదివారం జరిగిన మహిళ హత్య కేసు విచారణను పోలీసులు ముమ్మరం చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ సతీష్‌కుమార్ విచారణకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్, లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ సుప్రజ, డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతోంది. విజయవాడకు చెందిన సీసీఎస్ పోలీసులు విజయవాడలో కూడా దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

మృతురాలు పామర్రు వాసి

మృతురాలు కృష్ణాజిల్లా పామర్రు గ్రామానికి చెందిన సజ్జ లక్ష్మి తిరుపతమ్మ (32)గా పోలీసులు గుర్తించారు. ఈమె భర్త నవీన్ అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి శీలం ఝాన్సీ వద్ద పిల్లలిద్దరినీ ఉంచింది. విజయవాడలో వంటపని చేస్తున్నానని తల్లికి చెబుతూ వస్తోంది. విజయవాడలోని కృష్ణలంకలో ఉంటోంది. ఏడాది క్రితం ట్రాన్స్‌జెండర్ జెస్సీ పరిచయమైంది. ఆమె లక్ష్మీతిరుపతమ్మను వ్యభిచార వృత్తిలోకి దించినట్లు సమాచారం. ఆ తర్వాత మరో ట్రాన్స్‌జెండర్ నజీరతోనూ పరిచయమైంది. వీరి ద్వారా తిరుమపత్మ మాజీ ప్రియుడు రాధారంగా నగర్‌కు చెందిన చింటూ గురించి పోలీసులు తెలుసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. తిరుపతమ్మ తన ఇద్దరు బిడ్డలను చదివించుకోవడం కోసమే ఈ వృత్తి చేపట్టినట్లు తెలుస్తోంది.

ఎవరు చంపి ఉండొచ్చు?

జెస్సీ నజీరాతోపాటు లక్ష్మీతిరుపతమ్మ ఆదివారం రాత్రి కూడా కొలనుకొండ జాతీయ రహదారి వద్దకు వచ్చింది. జెస్సీ విటులను పిలిచి లక్ష్మీతిరుపతమ్మతో పంపేది. ఆదివారం రాత్రి కూడా తొలుత ఇద్దరు విటులు వెళ్లారు. అనంతరం చేతిలో ఒక సంచి పట్టుకుని హిందీలో మాట్లాడే పొట్టిగా నల్లగా ఉన్న వ్యక్తి లక్ష్మి తిరుపతమ్మ వద్దకు వెళ్లాడు. అతను తిరిగి వచ్చిన తరువాత ముళ్ల పొదల్లో నుంచి తిరుపతమ్మ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన జెస్సీ, నజీర లోపలకు వెళ్లి చూశారు. రక్తపు మడుగులో పడి ఉన్న తిరుపతమ్మ కనిపించింది. దీంతో భయపడిన వారిద్దరూ పెద్దగా కేకలు వేశారు. 108కు ఫోన్ చేశారు. 108 సిబ్బంది వచ్చి లక్ష్మీతిరుపతమ్మ మృతి చెందిందని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. రాత్రి 8 గంటలకు ఘటన జరిగితే తాడేపల్లి పోలీసులు రాత్రి 9.30 గంటలకు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఈ సమయంలో తిరుపతమ్మ మాజీ ప్రియుడు చింటూ కూడా అదే ప్రాంతంలో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. కొంతకాలంగా తిరుపతమ్మ తనను దూరం పెడుతుందని చింటూ కోపంగా ఉన్నట్టు తెలుస్తోంది.

అనాథలుగా పిల్లలు

లక్ష్మీతిరుపతమ్మ మృతి వార్త తెలుసుకుని ఘటనా స్థలానికి వచ్చిన ఆమె తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పిల్లల్ని పోషించుకోవడం కోసం వంట పనికి వస్తుందని భావించామే కానీ ఇలాంటి పనులు చేస్తోందని ఊహించలేదని, ఇప్పుడు ఆమె ఇద్దరు పిల్లలు అనాథలు అయ్యారని గుండెలవిసేలా విలపించారు. పిల్లల సంరక్షణను ప్రభుత్వం తీసుకోవాలని కోరారు.

మూడు నెలలుగా వీడియోలు, రీల్స్



రీల్ చేస్తున్న లక్ష్మి తిరుపతమ్మ (ఫైల్)

హత్య జరిగిన ప్రాంతంలో ఎన్నాళ్లగానో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా.. పోలీసులు పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంతంలో గంజాయి అమ్మకాలూ జరుగుతున్నట్టు సమాచారం. మూడునెలలుగా ఇక్కడే లక్ష్మీతిరుపతమ్మ, మరికొందరు రీల్స్, సెల్ఫీ వీడియోలు చిత్రీకరించినట్లు సమాచారం. డీజీపీ కార్యాలయం సమీపంలో నిత్యం వీవీఐపీలు తిరిగే రహదారిలో భద్రతా వైఫల్యానికి ఇది నిదర్శనంగా ఉంది. తిరుపతమ్మ, ఆమె ప్రియుడు చింటూ, జెస్సీ కొలనుకొండ ప్రాంతంలో దౌర్జన్యం చేస్తూ వ్యభిచార వృత్తిలో ఉన్న ఇతరులను రానీయకుండా విటులను తీసుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారని, ఇక్కడ వీరి ఆధిపత్యం ఏమిటనే భావనతో ప్రత్యర్థులు ఈ హత్య చేసి ఉంటారా అనే అనుమానమూ వ్యక్తమవుతోంది.

'పాప'ం పసికందు

- పెదకాకాని తోటలో నెలల పాప
- విడిచి వెళ్లిన తల్లి!
- గుంటూరు చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌కు తరలించిన పోలీసులు



పెదకాకాని తోటలో వదిలి వెళ్లిన పసికందుతో సీఐ

పెదకాకాని: బోసినవ్వులొలుకుతూ అమ్మ పొత్తిళ్లలో హాయిగా ఆడుకోవాల్సిన ఐదునెలల పాపను ఎవరో అనాథలా పెదకాకాని ఏసుప్రభు తోటలో వదిలివెళ్లారు. తల్లి స్పర్శ కోసం చాలా సేపు తల్లడిల్లిన పసికందు.. క్యార్‌మంటూ గుక్కపెట్టింది. అక్కడున్న వారు పాపను గుర్తించి అక్కున చేర్చుకున్నారు. పోలీసులకు సమాచారం అందించారు. ఈ హృదయ విదారక ఘటన సోమవారం పెదకాకాని స్వస్థిశాలలో చోటు చేసుకుంది. ఇక్కడ ప్రతి సోమవారం, రెండో శనివారం ప్రార్థనలు జరుగుతుంటాయి. ఈ ప్రార్థనలకు పెద్ద ఎత్తున రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఎప్పటిలానే సోమవారం జరిగిన ప్రార్థనలకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అయితే ఎవరో నెలల పాపను అక్కడ వదిలి వెళ్లారు. పాప ఏడుస్తుండడంతో గుర్తించిన తోటి భక్తులు పాపను దగ్గరకు తీసుకున్నారు. సమాచారాన్ని పెదకాకాని పోలీసులకు తెలియజేశారు. పోలీసులు పాపను పోలీసు స్టేషన్‌కు తీసుకు వెళ్లారు. మూడు నెలల నుంచి ఐదు నెలల వయస్సు ఉన్న ఈ పాపను సంరక్షణ నిమిత్తం గుంటూరు చైల్డ్ వెల్ఫేర్ సెంటర్(సీడబ్ల్యూసీ)కి అప్పగించినట్లు పెదకాకాని సీఐ టి.పి.నారాయణస్వామి తెలిపారు.

హద్దులు దాటుతున్న ఇసుక

- కృష్ణా జిల్లాలో ఉచిత ఇసుక క్వారీ
- ఉమ్మడి గుంటూరు జిల్లాకు తరలింపు
- గాలు రోడ్డే అక్రమాలకు మార్గం
- పట్టించుకోని అధికారులు



కృష్ణా జిల్లా క్వారీ నుంచి గాలు మార్గం ద్వారా బాపట్ల జిల్లాలోకి ప్రవేశిస్తున్న ఇసుక లారీలు

కొల్లూరు: కూటమి నేతలు ఇసుకను అక్రమ మార్గంలో హద్దులు దాటిస్తున్నారు. అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కృష్ణా జిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళం ప్రాంతంలో ఉచిత ఇసుక క్వారీ ఉంది. ఇసుకను భారీ లారీలలో నింపి దొడ్డిదారిలో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల కు అక్రమంగా తరలిస్తున్నారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం గాజుల్లంక, కృష్ణా జిల్లా శ్రీకాకుళం గ్రామాల నడుమ వ్యవసాయ కార్యకలాపా లు, ప్రయాణికుల రాకపోకల కోసం ఏర్పాటు చేసిన గాలు మార్గం వారి అక్రమాలకు రాచమార్గంగా మారింది. రోజుకు 100 ఇసుక లారీలు అక్రమంగా తరలివెళుతున్నాయి.

బిల్లులు నిల్

నిబంధనల మేరకు రీచ్‌ల నుంచి ఇసుక రవాణా చేసే వాహనాలు రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించి ఇతర జిల్లాల్లోకి బిల్లులతో ప్రవేశించాల్సి ఉంది. అయితే ఉచిత ఇసుక క్వారీలను దక్కించుకున్న కూటమి నాయకులు బిల్లులు లేకుండానే బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లా లకు ఇసుకను యథేచ్ఛగా అక్రమంగా తరలిస్తున్నారు.

పట్టించుకోని యంత్రాంగం

కృష్ణా జిల్లా నుంచి నదిలోని గాలు మార్గం ద్వారా బిల్లులు లేకుండా ఇసుక అక్రమంగా జిల్లాలోకి వస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పగలు, రాత్రి తేడా లేకుండా అధిక సంఖ్యలో వాహనాలు గాజుల్లంక, పెసర్లంక, కొల్లూరు, పోతార్లంక, దోనేపూడి, కిష్కిందపాలెం, తోకలవారిపాలెం మీదుగా తరలివెళుతున్నా యి. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖల అధికారులు మాత్రం స్పందించడంలేదు. పెసర్లంక-కొల్లూరు రహదారి పనులు జరుగుతున్న తరుణంలో ఇసుక లారీల నుంచి కారుతున్న నీరు కారణంగా రోడ్డు మన్నిక ప్రశ్నార్థకంగా మారుతుంది.

కూలీల కడుపుకొడుతున్నారు

ఉచిత ఇసుక క్వారీలలో తవ్వకాలకు కూలీలను మాత్రమే వినియోగించాలన్న నిబంధనకు తూట్లు పొడుస్తున్నారు. కాంట్రాక్టర్లు యంత్రాలను వినియోగిస్తున్నారు. నదిలో ట్రాక్టర్లు దిగి కూలీలతో ఇసుక నింపకుండా గుంతలు తీసి అడ్డుకుంటు న్న అధికారులు పక్క జిల్లా నుంచి అక్రమ మార్గంలో ఇసుకరవాణా జరుగుతున్నా పట్టించుకోలేదు.

పరిశీలించి చర్యలు

నదిలో అక్రమ మార్గం ద్వారా జిల్లాలోకి ఇసుక రవాణాను అరికట్టే విషయంలో రూల్స్‌ను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. మైనింగ్ శాఖాధికారులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి కృష్ణా నదిలో జిల్లా దాటి బిల్లులు లేకుండా వాహనాలు వస్తే ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న అంశాన్ని పరిశీలిస్తాం.

– బి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్, కొల్లూరు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ అత్యవసర సమావేశం తాత్కాలిక మేయర్ షేక్ సజీల అధ్యక్షతన జరగనుంది. ఇటీవల నగర మేయర్‌గా కావటి శివనాగమనోహర్‌నాయుడు రాజీనామా చేసిన నేపథ్యంలో ఆమోద తీర్మానం చేసేందుకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు



విజయపురిసౌత్: మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు అన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదేశాలతో మాచర్ల మండలం అనుపు వద్ద కృష్ణా జలాశయంలోకి 10 లక్షల చేప పిల్లలను సోమవారం విడుదల చేశారు. అనంతరం సంజీవరావు మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత వారంలో సైతం 10 లక్షల చేప పిల్లలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అలి వలలతో చేపల వేట చేస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. మత్స్య సంపదను కాపాడుకోవాలని సూచించారు. ఎఫ్‌డీఓ టీవీఏ శ్రీనివాసరావు, అగ్రికల్చర్ ఏఓ జగదీష్, మత్స్యశాఖ తనిఖీ అధికారి వెంకటరమణ, గ్రామ మత్స్య సహాయకులు లీలావతి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యార్డుకు 1,18,783 బస్తాలు మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,18,783 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,05,617 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,200 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,200 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 64,366 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

అర్జీలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి

కలెక్టర్ నాగలక్ష్మి



బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

గుంటూరు వెస్ట్: కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల అర్జీదారులు పదే పదే వస్తున్నారని, ఈ విధానం మారాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ చిన్న చిన్న అంశాలను కొందరు సిబ్బంది అర్థం చేసుకోకుండా వ్యవహరిస్తున్నారన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలు చాలా కీలకమన్నారు. వీటిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కరించాలన్నారు. అనంతరం వచ్చిన 231 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

అక్రమ కేసులు బనాయిస్తున్నారు



పొన్నూరులోని తెలగపాలెం పొంతంలో రమేష్ అనే వ్యక్తి అక్రమంగా చర్చిని నిర్మించడంతోపాటు మత మార్పిడులకు పాల్పడుతున్నాడు. చర్చికి ఎటువంటి అనుమతులూ లేవు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నాడు. పట్టణ ప్రాంతంలో అందరూ కలిసిమెలసి జీవిస్తున్నాం. రమేష్ కారణంగా మతసామరస్యానికి భంగం కలుగుతోంది. తగిన చర్యలు తీసుకోవాలని మనవి.

– హిందూ చైతన్య వేదిక, పొన్నూరు

పట్టాలకు విలువలేదంటున్నారు



గత ప్రభుత్వ హయాంలో మాకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఆ పట్టాలు పనికిరావని చెబుతున్నారు. మాకు ఎక్కడా భూమి కూడా చూపడంలేదు. కూటమి ప్రభుత్వానికి పేదలంటే చాలా చులకన. సిబ్బంది కనీసం సమాధానం కూడా చెప్పడంలేదు. మాకు న్యాయం చేయండి.

– గుంటూరులోని సుగాలీ కాలనీ వాసులు

సాయుధ దళాలకు ఆర్థిక చేయూత అభినందనీయం



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్ : దేశం కోసం, సమాజం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందిస్తున్న సాయుధ దళాలకు ఆర్థిక చేయూతనందించడం అభినందనీయమని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సాయుధ దళాల పతాక దినోత్సవం-2024కు సంబంధించి గుంటూరు జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ స్వయం సహాయక బృందాల నుంచి సేకరించిన రూ.2,05,197 చెక్కును మెప్మా పీడీ విజయలక్ష్మి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ చేతుల మీదుగా జిల్లా సైనిక సంక్షేమాధికారి ఆర్.గుణ శీలాకు అందజేశారు. ఈ సందర్భంగా మెప్మా విభాగ కృషిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **6,500** గరిష్టం : రూ. **7,800**

మోడల్ ధర రూ. **7,200**

క్లుప్తంగా

60 మంది మహిళా పారిశ్రామికవేత్తలకు అవార్డులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక ఐటీసీ హోటల్‌లో బీఎన్ఐ గుంటూరు ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించారు. గుంటూరులోని వివిధ రంగాలకు చెందిన 60 మందికిపైగా మహిళా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను అభినందించి అవార్డులు అందించారు. ముఖ్య అతిథులుగా బెంగళూరు నుంచి అన్నె కుమార్, చాందిని చందన, బీఎన్ఐ గుంటూరు ఈడీ శేఖర్‌బాబు హాజరై, మాట్లాడారు. బీఎన్ఐ ప్రతినిధులు డాక్టర్ అనూష, పోట్రు వీరయ్యచౌదరి, క్రాంతి పర్యవేక్షించగా సురక్ష కన్సల్టెన్సీ ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరించారు.

బోరుగడ్డపై మరో కేసు, అరెస్టు

ఫిరంగిపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌పై అసభ్య పదజాలం వాడిన బోరుగడ్డ అనిల్‌పై మరో కేసు నమోదైంది. దీంతో ఫిరంగిపురం పోలీసులు అతడిని పీటీ వారెంట్‌పై సోమవారం అరెస్టు చేశారు. సీఐ రవీంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం బోరుగడ్డ అనిల్‌పై ఫిరంగిపురం గ్రామానికి చెందిన పి.ఊర్దయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి పీటీ వారెంట్‌పై నిందితుడిని అరెస్టు చేసి ఎస్కార్టుతో నరసరావుపేట రెండో జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం హాజరు పరిచారు. వచ్చేనెల 4వరకు అనిల్‌కుమార్‌కు జడ్జి రిమాండు విధించారు.

వైద్య కళాశాలలో ఐఎఫ్ మైక్రో స్కోప్ ప్రారంభం

గుంటూరు మెడికల్: బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ రూ. 8.50 లక్షల విరాళంతో గుంటూరు వైద్య కళాశాల పెథాలజీ వైద్య విభాగంలో ఇమ్యూనో ఫ్లోరోసెన్స్ మైక్రో స్కోప్‌ను సోమవారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి ప్రారంభించారు. వైద్య కళాశాల అభివృద్ధికి దాతలు చేస్తున్న సేవలు అమూల్యమని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, పలువురు పెథాలజీ వైద్యులు పాల్గొన్నారు.

పుత్రశోకంతో తల్లడిల్లుతున్నాం

- న్యాయం చేయండి
- ఎస్పీకి విన్నవించుకున్న బాధితులు
- కొడుకు జాడ కనుక్కోవాలని ఒకరి విన్నపం
- కుమారుడిని హతమార్చిన వారిని గుర్తించాలని మరొకరి వేడుకోలు



బాధితురాలి సమస్యను అలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పుత్రశోకంతో తల్లడిల్లుతున్నామని, తమకు న్యాయం చేయాలని ఇద్దరు బాధితులు ఎస్పీ సతీష్‌కుమార్ ఎదుట తమ గోడు వినిపించారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) నిర్వహించారు. బాధితుల అర్జీలను ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. ఫిర్యాదుదారుల బాధను ఆలకించారు. అర్జీలపై సబ్ డివిజన్లలోని పోలీసు అధికారులతో మాట్లాడారు. తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారిణి దీక్ష, జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ.రమణమూర్తి, డీఎస్పీలు రమేష్ (ట్రాఫిక్), సుబ్బారావు (మహిళా పీఎస్) అర్జీలు స్వీకరించారు.

కుమారుడు మృతిచెందాడు..

ఈనెల తొమ్మిదో తేదీ రాత్రి చిన్న కుమారుడైన వై.హరికృష్ణ (41) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా స్తంభాలగరువు సెంటర్ ఓ కంటి ఆసుపత్రి సమీపాన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళ్తూ హరికృష్ణను కాలితో కొట్టి, చేతులతో నెట్టేశారు. దీంతో కొడుకు కిందపడిపోవడంతో బలమైన గాయాలయ్యాయి. గాయపడిన అతను చికిత్స పొందుతూ ఈనెల 18న మృతిచెందాడు. దీనిపై పట్టాభిపురం పీఎస్‌లో కేసు నమోదు చేశారు. పది రోజులుగా పోలీసులు చుట్టూ తిరుగుతున్నా.. ఇప్పటి వరకు అనుమానితులను గుర్తించలేదు. ఇప్పటికైనా నిందితులను గుర్తించి న్యాయం చేయాలని కోరుతున్నాం.

– వై.రత్నకుమారి, రాజేంద్రనగర్ ఒకటో వీధి.

కొడుకు ఆచూకీ గుర్తించండి



పెద్దబ్బాయి ఓంసాయిరెడ్డి గుంటూరు కృష్ణనగర్ నాలుగో వీధిలోని నారాయణ విద్యా సంస్థలో 10వ తరగతి చదివేవాడు. తొంభై శాతం సీటు రాయితీతో చేర్చాం. ఫీజు రాయితీ తొంభై శాతం నుంచి 80శాతానికి కుదించామని డబ్బులు చెల్లించాలని బయట నిలబెట్టారు. ఈ క్రమంలో నా సోదరుడు వెళ్లి ఫీజు చెల్లిస్తామని చెబితే లోనికి అనుమతించారు. గతనెల 8, 9 తేదీల్లో స్కూల్ నుంచి కుమారుడు ఫోన్ చేసి మాట్లాడాడు. బాగా చదువుతానని బదులిచ్చాడు. అదేనెల 13న విద్యా సంస్థల నుంచి ఫోన్ చేసి, ఓంసాయిరెడ్డి కనిపించడం లేదని తెలిపారు. సాయంత్రం వెళ్లి స్కూల్‌లో విచారించాం. అప్పటి నుంచి కుమారుని జాడలేదు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. కుమారుడు కనిపించక ఇప్పటికి నలభై రోజులకుపైగా గడిచింది. నా కొడుకుకు వ్యసనాల్లేవు.

– తండ్రి వెండిదండి శివశంకర్‌రెడ్డి, పోస్ట్ మాస్టర్, ముప్పలపాడు గ్రామం, హనుమంతునిపాడు మండలం, ప్రకాశం జిల్లా

కేవీకేలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీవీ విశ్వవిద్యాలయం ఉపకులపతి జేవీ రమణ

గుంటూరు రూరల్: శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ సలహా మండలి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సోమవారం నగర శివారుల్లోని లాం ఫాంలోని కేవీకేలో ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ ఎం.యుగంధర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. పశు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జేవీ రమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధనశాలల్లో రూపుదిద్దుకుంటున్న సాంకేతికతను రైతులకు చేరవేయటంలో కృషివిజ్ఞాన కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. వివిధ రంగాల్లో శిక్షణ, నైపుణ్యాల వృద్ధి కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గ్రామీణ యువతకు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ శారదజయలక్ష్మిదేవి మాట్లాడుతూ శాస్త్రీయ సలహా మండలి సూచనలు, సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించాలని అభిప్రాయపడ్డారు. ఏపీ పశు గణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గేదెల యాజమాన్య పద్ధతులపై కేవీకే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ బి. శోభామణి, డాక్టర్ శివన్నారాయణలు క్షేత్రస్థాయి పరిశీలనలు, సూక్ష్మ సమన్వయంతో నిర్వహించేట్లు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు నరసింహారావు, ఎల్ఆర్ఎస్ హెడ్ డాక్టర్ ముత్తారావు వ్యవసాయ, అనుబంధ సంస్థల నిపుణులు వారి సలహాలను అందించారు. కేవీకే శాస్త్రవేత్తలు 2024–25 సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. 2025–26 సంవత్సరంలోని కార్యాచరణ ప్రణాళికలను వివరించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్‌కుమార్ మాట్లాడుతూ సలహా మండలి సలహాలు సూచనలు పాటిస్తూ భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, ఎల్ఆర్ఎస్ సిబ్బంది, రైతులు, శాస్త్రవేత్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించండి



ఐదారు నెలలు క్రితం నల్లచెరువు పదో వీధిలో మద్యం దుకాణం నెలకొల్పారు. దీంతో మందుబాబులు మద్యం సీసాలతో వచ్చి స్థానిక ఇళ్ల వద్దనున్న అరుగులపై కూర్చుని మద్యం తాగుతున్నారు. మద్యం మత్తులో రహదారికి అడ్డుగా ఉంటున్నారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చిన ఒకట్రెండు రోజులు మందుబాబులు కనిపించరు. తర్వాత అక్కడే తిష్టవేస్తున్నారు. వేసవి దృష్ట్యా సాయంత్రం వేళ ఇళ్ల ముందు కూర్చోవాలంటే భయంగా ఉంటుంది. మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరుతున్నాం.

– స్థానికులు ఈమని విజయలక్ష్మి ఎస్.కృష్ణకుమారి, మహాలక్ష్మి, లక్ష్మీకుమారి, లక్ష్మీసౌజన్య, నల్లచెరువు పదో వీధి

27న గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు



పరిచయ కార్యక్రమానికి హాజరైన న్యాయవాదులు

గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 27న జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పరిచయ కార్యక్రమం సోమవారం జరిగింది. అభ్యర్థులు తమ మేనిఫెస్టోను న్యాయవాదుల ముందు ఉంచారు. అధ్యక్ష పదవికి యగలశెట్టి శివ సూర్య నారాయణ, కాజా భరద్వాజ, నంబూరు పాములు, మధిర నాగేశ్వరరావు పోటీలో ఉన్నారు. వీరు బార్ అసోసియేషన్‌ను ప్రగతి పథంలో నడిపిస్తామని ఎలక్షన్ ఆఫీసర్ కాసు వెంకటరెడ్డి, న్యాయవాదుల సమక్షంలో ప్రమాణాలు చేశారు. వైస్ ప్రెసిడెంట్ పదవికి మాలే దేవరాజు, డాక్టర్ చింతా రామ కోటిరెడ్డి, జనరల్ సెక్రెటరీ పదవికి ఎర్రప్రాని అజయ్ కుమార్, మొగల్ కాలే షా బేక్, మోతుకూరి శ్రీనివాసరావు. జాయింట్ సెక్రటరీ పదవికి పామ్మినేని చంద్రశేఖర్, ఇల్లూరి విజయ్ వర్మ, గూడూరి అశోక్ కుమార్, జీవీఎస్ఆర్‌కేఎస్ చంద్రస్, లైబ్రరీ కార్యదర్శి పదవికి ముప్పా పాపిరెడ్డి, బొప్పా శ్రీనివాసరావు స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా కొప్పాల హనుమంత రావు, గండికోట శేషగిరిరావు పోటీలో ఉన్నారు. లేడీ రిప్రజెంటివ్ పదవికి అడపా ఇందిరా, పూర్ణం కళ్యాణి, లేడీ ఎగ్జిక్యూటివ్ పదవికి కండెపు కవిత, మంద విజయ్ కుమారి పోటీలో ఉన్నారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ పదవికి మోర్ల బాల సుందరి, మహమ్మద్ దాదా ఖరీం, బండ్లకృష్ణ, పల్లె నరసింహారావు, పి.సురేష్ కుమార్ పోటీలో ఉన్నారు. జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవికి లింగాల మారుతి, శివ నాగ ప్రసాద్, షేక్ రిహాన్ బేగం, పెరుమాళ్ళ శివ రంగనాయకులు, రాయపూడి శ్రీనివాసరావు (గుండు శీను) పోటీలో ఉన్నారు. గుంటూరు బార్ అసోసియేషన్‌లో సుమారు 3వేల మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 2012 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

కొత్త కవులను ప్రోత్సహిద్దాం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక బ్రాడిపేటలోని కథా రచయిత్రి తాటికోల పద్మావతి నివాసంలో గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కవులందరూ కలిసి 'కవిత్వంతో కాసేపు' నిర్వహించారు. ఈనెల 21 న అంతర్జాతీయ కవితా దినోత్సవం , 30న ఉగాది పండుగ సందర్భంగా కవిత్వంపై చర్చించారు. ఔత్సాహిక కవులను ప్రోత్సహించడమే లక్ష్యంగా సంఘం పని చేద్దామని సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.సుభాని తెలిపారు. కవులు తాము రాసిన కవిత తోపాటు సమకాలీన కవులు రాసిన, తమకు నచ్చిన మరో కవిత వినిపించి జయప్రదం చేశారని కోశాధికారి నానా చెప్పారు. రచయిత్రి తాటికోల పద్మావతి ఆతిథ్యం, ఆప్యాయతలను కవులు కొనియాడారు. సంఘం ఉపాధ్యక్షులు బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, సభ్యులు ఈవూరి వెంకట రెడ్డి, కొణతం నాగేశ్వరరావు, శ్రీవశిష్ట సోమేపల్లి పాల్గొన్నారు.

భార్యను హత్యచేసిన వ్యక్తికి జీవిత ఖైదు

చినగంజాం: భార్యను హత్యచేసిన కేసులో వ్యక్తికి కోర్టు జీవిత ఖైదు విధించింది. పోలీసుల సమాచా రం..బాపట్ల జిల్లా చినగంజాంలోని మహాలక్ష్మి కాలనీకి చెందిన కత్తి శ్రీనుకు తన భార్య కత్తి దుర్గ(30) తో మనస్పర్థలు వచ్చాయి. భర్తతో విభేదించి ఆమె పుట్టింటికి వచ్చింది. తల్లిదండ్రులు మల్లవరపు అంజయ్య, రాఘవమ్మ ఇంట్లో తన పిల్లలతో ఉంటోంది. ఈ గొడవలు మనసులో పెట్టుకున్న శ్రీను గతేడాది జూన్‌లో దుర్గ ఉంటున్న ఇంటికెళ్లి కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆమె ఘట నా స్థలంలోనే చనిపోయింది. మృతురాలి తల్లి రాఘవమ్మ ఫిర్యాదు ఆధారంగా అప్పటి ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ బత్తుల శ్రీనివాసరావు దర్యాప్తు చేసి నిందితుడిని రిమాండుకు పంపారు. ఇప్పటి సీఐ వై.వి.రమణయ్య దర్యాప్తు పూర్తి చేసి నివేదికను కోర్టుకు సమర్పించారు. అనంతరం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతి కుమారి వాదనలతో ఏకీభవించిన ఒంగోలు మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి డి.రాములు నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.1600 జరిమానా విధించారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా.. ఇంతవరకు తమ వేతనాలు పెంచలేదని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ ధ్వజమెత్తారు. పాతగుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్షురాలు ఏపీఎస్ కుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకపోగా ఉద్యోగుల పేరుతో కరెంట్ బిల్లులు పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు హెల్పర్‌లు అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ ఇస్తామని మోసం చేశారని పేర్కొన్నారు. సమావేశంలో అంగన్‌వాడీల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులుగా వై.రమణను గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దీప్తి, ఉపాధ్యక్షులు సుకన్య, ధనలక్ష్మి, హేమలత, రాజకుమారి, శివ పార్వతి పాల్గొన్నారు.

29న బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం

పెదకాకాని: బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం మార్చి 29, 30 తేదీలలో నిర్వహిస్తున్నట్లు దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా తెలిపారు. గుంటూరు జిల్లా పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గా 537వ ఉరుసు మహోత్సవం పురస్కరించుకుని సోమవారం ఎమ్మెల్యే దూళిపాళ్ళ నరేంద్రకుమార్ చేతుల మీదుగా పోస్టర్లు ఆవిష్కరించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించే ఉరుసు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా పాల్గొన్నారు.

నాడు డ్రాపవుట్.. నేడు పట్ట'భద్రత'పై పట్టు

- యూజీసీ కమిటీకి తెనాలి బిడ్డ సారథ్యం
- జాతీయ భద్రత అధ్యయాలపై సరికొత్త కోర్సు రూపకల్పనకు కృషి
- డాక్టర్ రమేష్ కన్నెగంటి విజయప్రస్థానం



ఎనిమిది దేశాల సైనికాధికారులతో సమావేశంలో



డాక్టర్ కన్నెగంటి రమేష్‌బాబు

తెనాలి: చదువుల్లో ఒకనాటి డ్రాపవుట్ కుర్రోడు...ఇప్పుడు ఏకంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆధ్వర్యంలోని కమిటీకి సారథి అయ్యారు. అదికూడా జాతీయ భద్రత అధ్యయనాలకు సంబంధించిన సరికొత్త 'మ్యాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సు' రూపకల్పన కోసం. ప్రసిద్ధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు, వైస్‌ఛాన్సలర్ సభ్యులుగా గల కమిటీకి ఆయన నాయకత్వం వహిస్తుండటం మరింత విశేషం.

చదువు విలువ తెలుసుకుని..

తెనాలి బిడ్డ డాక్టర్ రమేష్ కన్నెగంటి. పుల్లరి ఉద్యమ యోధుడు కన్నెగంటి హనుమంతు ముని మనవడు. ఇంటర్ ఫెయిలయ్యారు. చదువు మానేశారు. తర్వాత విద్య విలువ తెలుసుకుని మళ్లీ పుస్తకం పట్టారు. బీఏ వరకు ఇక్కడే చదివారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్‌లో పీజీ అనంతరం, న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో 'యూఎస్–ఆస్ట్రేలియా సెక్యూరిటీ రిలేషన్స్'పై ఎంఫిల్ చేశారు. 2000–01లో 'మిస్టర్ జేఎన్‌యూ' టైటిల్‌ను 'ద్రోణాచార్య' గురుచరణ్‌సింగ్ చేతుల మీదుగా అందుకున్నారు. 2002–03లో ఇజ్రాయెల్‌లోని హిబ్రూ యూనివర్సిటీలో 'ఇంటర్నేషనల్ రిలేషన్స్' చదివారు. జేఎన్‌యూలో 2006లో 'యూఎస్–ఇజ్రాయెల్ సెక్యూరిటీ రిలేషన్స్ ఇన్ ది పోస్ట్ కోల్డ్‌వార్ ఎరా'పై పీహెచ్‌డీ చేశారు. తర్వాత ఇజ్రాయెల్‌లోని బార్–ఇలాన్ యూనివర్సిటీలో 'యూఎస్–ఇజ్రాయెల్–ఇండియా స్ట్రాటెజిక్ రిలేషన్స్' (టె రరిజాన్ని ఓడించటానికి మూడు దేశాల త్రిముఖ వ్యూహం'పై పోస్ట్‌డాక్టోరల్ ఫెలోషిప్ చేశారు.

బాంబు పేలుళ్ల నేపథ్యంలో జాతీయ భద్రతపై దృష్టి

దేశంలో జరిగిన ఉగ్రవాద బాంబు పేలుళ్ల నేపథ్యంలో డాక్టర్ రమేష్ దృష్టి మానవ భద్రతపైకి మళ్లింది. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న ఉగ్రవాదం, ప్రవాదం, పేదరికం, నిరక్షరాస్యత, వెనుకబాటుతనాన్ని టెక్నాలజీ సాయంతో ఎదుర్కోవటంపై అధ్యయనం, పరిశోధన కొనసాగించారు. ఆ క్రమంలోనే 2013లో హైదరాబాద్‌లో మానవ రక్షణ అధ్యయన సంస్థ (సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్)ను కొందరు స్నేహితులు, సంస్థల సహకారంతో ఆరంభించారు. పన్నెండేళ్లలోనే ఆ సంస్థ దేశ అంతర్గత భద్రత, విదేశీ వ్యవహారాలపై 'థింక్ ట్యాంక్'గా పలు విజయాలను సాధించింది. ఐఐటీ, నల్సార్ లా యూనివర్సిటీతో సహా పలు యూనివర్సిటీలు, ఆంధ్ర, తెలంగాణ పోలీసులతో సంస్థ ఎంఓయూలను కుదుర్చుకుంది. సంస్థ 12వ వార్షికోత్సవం ఈనెల 22న జరుపుకున్నారు.



ఐఐటీ, ముంబయితో ఎంఓయూలో

స్మార్ట్ పోలీసింగ్‌కు శ్రీకారం

టెక్నాలజీ సాయంతో మానవభద్రత అంశంపై పలు ఉన్నత విద్యాసంస్థలు, ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్న రమేష్, కృత్రిమ మేధతో స్మార్ట్ పోలీసింగ్, ఓడరేవుల రక్షణపై సరికొత్త ప్రోగ్రామ్‌లను రూపొందించారు. ఫలితంగా అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఆయనకు ఆహ్వానం లభించింది. యూనివర్సిటీ హ్యూమన్ సెంటర్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (హెచ్ఏఐ) ఆధ్వర్యంలో గతేడాది అక్టోబరులో జరిగిన 'మానవ–కేంద్రీకృత కృత్రిమ మేధస్సు' శిక్షణకు డాక్టర్ రమేష్ హాజరయ్యారు. చైనా ప్రాబల్యం నుంచి హిందూ, పసిఫిక్ మహాసముద్రాల జలాలను కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీతో ఎలా కాపాడుకోవాలి అనే అంశంపై వివిధ దేశాల సీనియర్ మిలటరీ అధికారుల చర్చలకూ రమేష్ సంస్థ వేదికైంది.

తాజాగా యూజీసీకి..

యూజీసీ సారథిగా తాజాగా రమేష్ ఎంపికయ్యారు. జాతీయ విద్యావిధానం 2020 ప్రకారం సిలబస్, కోర్సు కంటెంట్‌ను ఖరారు చేస్తారు. క్రెడిట్‌ల సంఖ్య, కోర్సు కోసం మొత్తం మాడ్యూళ్ల సంఖ్య, పరిశ్రమల లింకేజీలు 'స్వయం' ప్లాట్‌ఫామ్‌పై కోర్సును సకాలంలో అభివృద్ధి చేసి, అందించటం యూజీసీ బాధ్యత. జాతీయ భద్రతపై ఓ కోర్సు ఉంటుందని డాక్టర్ రమేష్ 'సాక్షి'కి వెల్లడించారు. భద్రతా అంశాన్ని పాఠశాల విద్య నుంచే భాగం చేయాలని పేర్కొన్నారు.

హత్య కేసును విచారించిన ఎస్పీ

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణం మారుతీనగర్‌లో సోమవారం జరిగిన హత్య కేసు విచారణ నిమిత్తం పల్నాడు జిల్లా కె.శ్రీనివాసరావు సోమవారం హాజరయ్యారు. తొలుత ఆదిలక్ష్మి హత్యకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి మృతదేహాన్ని పడేసిన క్వారీని గుంతను పరిశీలించారు. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్‌కు చేరుకుని సీఐ శ్రీరామ్ వెంకట్రావుతో మాట్లాడారు.

అప్పులు కట్టలేక భార్యాభర్తలు అదృశ్యం

అద్దంకిరూరల్: అప్పులు కట్టలేనని.. ఇంట్లో పుస్తకంలో రాసిపెట్టి భార్యభర్తలు అదృశ్యమయ్యారు. ఈఘటన ఆదివారం అద్దంకి పట్టణంలో జరగ్గా భార్య, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు ఎస్సై ఖాదర్‌బాషా నమోదు చేశారు. ఎస్సై వివరాల మేరకు అద్దంకి పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన కుంచాల శ్రీనివాసరావుకు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తె అంజలికి మూడేళ్ల కిందట ఆలకుంట వెంకట్రావుతో వివాహం కాగా అద్దంకిలో ఉంటున్నారు. వెంకట్రావు బేల్దారి పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ప్రస్తుతం అంజలి గర్భిణి. ఈ క్రమంలో ఆదివారం తల్లి తన కుమార్తె అంజలి ఇంటికి వెళ్లగా ఇంట్లో ఎవరూ కనిపించలేదు. దీంతో కూతురు, అల్లుడు హాస్పటల్‌కు వెళ్లారని భావించి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ అని వచ్చింది. వెంటనే అద్దంకిలోని వైద్యశాలలో చూశారు. అక్కడా కూడా లేకపోవడంతో ఒంగోలులోని పలు వైద్యశాలలు వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో ఇంటికి వచ్చి అన్ని వెతకగా ఒక పుస్తకంలో తాము ఇవ్వాల్సిన అప్పుల జాబితా రాసి ఉంది. బంధువుల వద్ద అడగ్గా తమవద్దకు రాలేదని చెప్పారు.